## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పవరలో గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పవర గ్రామంలో గణపతి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆదివారం భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో గ్రామస్తులు గణపతి ఆలయం నిర్మించాలని దొరబాబును కోరారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షల నిధుల మంజూరు చేయించి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### నేడు డ్వామా పీఓలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామాలోని పీఓలకు మూడు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభం ప్రారంభమవుతుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాల్లో డ్వామా పీఓలు హాజరవుతారన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ ప్రారంభిస్తామన్నారు.

### 27న ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

కాకినాడ కల్చరల్: స్థానిక శాస్త్రి కళాపీఠంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించనున్నారు. ఆదివారం ఈ విషయాన్ని వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు విశేష కృషి చేస్తోన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులను 81797 86635 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని అన్నారు.

### అభిమానుల రక్తదానం

కాకినాడ కల్చరల్: కాకినాడ సిటీ వైడ్ చిరంజీవి, పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ అభిమాన సంఘం అధ్యక్షుడు చింతకాయల చిన్ని ఆధ్వర్యంలో ఆదివారం సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్‌లో మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి రాజా, పచ్చిపాల కోడిశ్రీను, వి.కోర్లయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు ఉద్యోగులు

కాకినాడ సిటీ: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్ర ఉద్యోగుల కౌన్సిల్ సమావేశాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు పయనమయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామమోహన్, పేపకాయల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో ఆదివారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేవీఎన్‌వీ ప్రసాద్, వై.పద్మమీనాక్షి, వి.కమల, వీరబాబు, బి.శ్రీనివాసు, షేక్ అజీజ్, ఎ.సత్తిరాజు, పాము శ్రీనివాస్, ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం తదితరులు పాల్గొని విజయవాడ బయలుదేరే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

### అంకిత భావంతో మధ్వమత ప్రచారం

కాకినాడ కల్చరల్: ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆదేశాల మేరకు ఆంధ్రాలో మధ్వమత ప్రచారాన్ని అంకిత భావంతో నిర్వహిస్తున్నామని మధ్వమత సమైక్య అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి అన్నారు. స్థానిక రామారావుపేటలోని మధ్వసభ ఆవరణలో మధ్వ ప్రచార సభ ఆదివారం జరిగింది. అధిక మాసం నెల రోజులూ మధ్వగృహస్తులను, భక్తులను భాగస్వామ్యం చేస్తూ హోమాలు, పూజలు నిర్వహించిన మధ్వేష్‌ను అభినందించారు. సుధాపండితులు విజయ సింహాచార్, తుంగమణి చేతుల మీదుగా మధ్వేష్‌ను రజిత జ్ఞాపికతో సత్కరించారు.

### మద్యం బ్రాండ్‌లతో నీటి అమ్మకాలు నిషేధించాలి

కాకినాడ సిటీ: దేశ వ్యాప్తంగా మద్యం బ్రాండ్ సంస్థల పేరుతో తాగునీటి అమ్మకాల ప్రచారాలు నిషేధించాలని జనవిజ్ఞాన వేదిక అనుబంధ మద్యపాన వ్యతిరేక జిల్లా ప్రచార కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక జవహర్‌వీధి వివేక్ భవన్‌లో జిల్లా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సమావేశం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ కన్వీనర్ నక్కా సూర్యనారాయణ, పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మద్యానికి మంచినీటికి తేడా లేకుండా ఒకే బ్రాండ్ పేరుతో సెలబ్రెటీలతో ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది యువతను మద్యానికి బానిస చేసే విధంగా ఉందన్నారు.

# ఖుషీ ఖుషీగా సాగుదామా..

- ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో
- మండలంలో 11,700 హెక్టార్ల భూమి
- జోరుగా పంట నమోదు ప్రక్రియ



కౌలు రైతుకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: సాగులో సిరులు కురిపించేందుకు.. రైతన్నల కన్నీళ్లు తుడిచేందుకు నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని అన్నివిధాలా తీర్చిదిద్ది రైతన్నలకు కొండంత అండ అయ్యారు. అమలు చేసే ప్రతి పథకం వారికి పక్కాగా అందించేందుకు ఈ-క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టారు. తద్వారా రైతులకు విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ మేలు జరుగుతోంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం సామర్లకోట మండలంలో జోరుగా జరుగుతోంది. రైతులూ ఈ-క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న విధానాలు పుడమి పుత్రులకు భరోసా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకునేందుకు ఈ-పంట నమోదు ప్రక్రియ కీలకంగా మారింది. ఈ మేరకు రైతులు ఏ రకమైన పంట వేశారో నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. మండలంలో 11.700 హెక్టార్లలో 9,006 మంది రైతులు వివిధ రకాల పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది 8,690 మంది రైతులు మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్నారు. పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం అందజేసే పథకాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం అందజేతలో ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిపై వారికి అవగాహన కల్పిస్తూ వ్యవసాయ అధికారులు ముందుకు సాగుతున్నారు.

**నమోదు ఎందుకంటే..**

రైతులు తమ పంట పొలాలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకోవడం వల్ల పంటల బీమా నష్ట పరిహారం అందుతుంది. సున్నా వడ్డీకి పంట రుణాలు పొందవచ్చు. ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల రైతులు తీసుకోవచ్చు. గిట్టుబాటు ధరకు ధాన్యం విక్రయించవచ్చు. రైతులకు కావాల్సిన వ్యవసాయ యంత్ర సామగ్రిని రాయితీపై తీసుకోవచ్చు. రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు, గ్రామం, సర్వే నంబరు, ఆధార్ వివరాలను నమోదు చేయించుకోవాలి. అనంతరం వీఏఏలు రైతుల పంట పొలాల వద్దకు వచ్చి పంట భూమి ఫోటో తీసి ఆన్‌లైన్ చేస్తారు. తద్వారా పంటల నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగి అర్హులందరికీ పథకాలు అందుతాయి.

**సద్వినియోగం చేసుకోండి**



ప్రతి రైతూ పంట నమోదు చేయించుకోవాలి. వ్యవసాయశాఖ, గ్రామ సర్వేయర్, వీఆర్వోలు క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. క్రాప్ బుకింగ్ ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతుంది. రైతులు స్వయంగా వారి సెల్ నుంచి క్రాప్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈకేవైసీ తరువాత సాగుదారునికి డిజిటల్ సమాచారం వస్తుంది. ఇప్పటి వరకూ 4,124 ఎకరాల్లో పంట నమోదు జరిగింది. మిగతా రైతులూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

**శ్రమ తగ్గింది**



గతంలో ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాల కోసం కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. నేడు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని సేవలూ అందిస్తున్నారు. ఈ- క్రాప్ బుకింగ్ చేసుకోవడంతో ధీమాగా ఉంటున్నాం. సున్నా వడ్డీ రుణాలతో పెట్టుబడికి ఇబ్బంది తప్పింది. కౌలు రైతులకూ పంట నమోదు మరింత మేలు చేస్తుంది. ప్రభుత్వం అందించే ప్రతి పథకం నేరుగా రైతులకే అందే విధంగా ఏర్పాట్లు చేయడం ఆనందంగా ఉంది.

– తలారి దొరబాబు, రైతు, వీకే రాయపురం

### వేట్లపాలెంలో వైఎస్సార్ సీపీకే పట్టం

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో కొన్నేళ్లు టీడీపీ హవా సాగింది. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి అక్కడ టీడీపీకి ఆదరణ తగ్గింది. శనివారం జరిగిన వేట్లపాలెం 14వ వార్డు సభ్యుని ఉప ఎన్నికను టీడీపీ నాయకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అయితే వైఎస్సార్ సీపీ మద్దతుదారు బొబ్బరాడ రాజునే విజయం వరించింది. 46 ఓట్ల మెజార్టీతో అతను విజయం సాధించాడు. రాజును, అతని విజయానికి కృషి చేసిన ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలి బాబ్జిలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అభినందించారు.

### 23న బాలాలయ ప్రతిష్ఠ

పెద్దాపురం: కట్టమూరులోని కేశవ పట్టాభి స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ నెల 23న బాలాలయ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చైర్మన్ మేడిద వెంకటరామారావు తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం కళాప్రకర్ష, బుధవారం ఉదయం ఆలయ సలహాదారు ఖండవల్లి సూర్యనారాయణ స్వీయ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పెద్దింటి సీతావెంకట నరసింహాచార్యులు, సీతారామాచార్యులు, వేదాంతం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో బాలాలయ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో భాగస్వాములు కావాలని వారు కోరారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- కాకినాడ ఎంపీ వంగా గీత
- మల్లాంలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం



మల్లాంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు. పిఠాపురం మండలం మల్లాంలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సైతం నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించి ఎక్కడా విద్యుత్ సమస్య అనేది లేకుండా చేస్తున్నామన్నారు. ఇటీవల వేసవిలో ఎక్కడా కరెంట్ కోతలు లేకుండా ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిందన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా విద్యుత్ వాడకం వల్ల కరెంటు బిల్లులు పెరిగితే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుని విద్యుత్ బిల్లులు పెంచేశారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసవి వచ్చిందంటే కరెంట్ కోతలతో జనం ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. గత నాలుగేళ్లగా వేసవిలో కరెంట్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. ప్రతి గ్రామంలోనూ వినియోగాన్ని బట్టి నూతన విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నామని, దీనిలో భాగంగా మల్లాంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

# సేవలు సద్వినియోగం చేసుకోండి



మెగా వైద్య శిబిరంలో మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్

పెద్దాపురం: పేదల కోసం స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత, లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అన్నారు. ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్, లలితా ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మట్టేవారి కల్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సేవా సంఘ అధ్యక్షుడు మట్టే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మెగా వైద్య శిబిరాన్ని ఉద్దేశించి పారిశ్రామిక వేత్త శ్రీనివాస్ మాట్లాడారు. ఈ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించిందన్నారు. పేదలకు వైద్య సేవలందించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సుమారు 800 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్టే ఆదీష్ బాబు, డాక్టర్ భార్గవ్, మణికంఠకుమార్, వాసవీ క్లబ్, యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జీవన శైలిలో మార్పులతో ఆరోగ్యం





సర్పవరం జంక్షన్‌లో మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సువర్ణరాజు

కాకినాడ రూరల్: నిత్య వ్యాయామంతో పాటు జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ సువర్ణరాజు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఊబకాయం, మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లోపించడం, వంశపారంపర్యంగా మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం, కంటి చూపు దెబ్బతింటుందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు సతీష్, జోన్ చైర్మన్ నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరావు, మూర్తి, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్ గాంధీకి ఘన నివాళి**

సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష, సువర్ణరాజు, కృష్ణమూర్తి, రాఘవరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- దుర్గాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



దుర్గాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా అని లబ్ధిదారులను ఆరా తీశారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన సమస్యలపై దృష్టి పెడుతున్నామన్నారు. గడపగడపకూ కార్యక్రమానికి వస్తున్న స్పందన ప్రతి పక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోందన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 100 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

# కొవ్వాడలో అగ్ని ప్రమాదం

- తల్లీ కూతుళ్లకు గాయాలు
- రూ.3 లక్షల ఆస్తి నష్టం

కాకినాడ రూరల్: కొవ్వాడ గ్రామ మెయిన్‌లోని ఓ భవనంలో నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వ్యాపించిన మంటలకు దుకాణంలోని తల్లీ కూతుళ్లు చెరుకూరి సూర్యవతి, విశాల కృష్ణప్రియాంక తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో చిక్కుకున్న వారిని గ్రామస్తులు కాపాడి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. సాలిపేట అగ్నిమాపక సిబ్బంది తక్షణమే కొవ్వాడ చేరుకుని మంటలు అదుపు చేశారు. పెద్ద శబ్దం, దట్టమైన అగ్నికీలలు చుట్టుముట్టడంతో దుకాణం మంటలకు పూర్తిగా దగ్ధమవ్వగా అందులోని సరకులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని, ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపారు. తల్లీ కూతుళ్లు సూర్యవతి, విశాల కృష్ణ ప్రియాంక గాయపడడంతో వారిని తాము వెళ్లేసరికే జీజీహెచ్‌కు తరలించారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెంటనే స్పందించి గ్రామస్తులు, గోపుశెట్టి బాబ్జీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే జీజీహెచ్‌కు వెళ్లి బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

# యథేచ్ఛగా పశువుల తరలింపు



జెడ్.రాగంపేట వద్ద ఆవులను మినీ గూడ్స్ వాహనంలో తరలిస్తున్న దృశ్యం



వాహనంలోని ఆవు బయటకు వచ్చేస్తుండటంతో లోపలకు నెట్టుతున్న క్లీనర్

గండేపల్లి: పశువధను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా అవి సక్రమంగా అమలు కావడం లేదు. పశువులను యథేచ్ఛగా కబేళాలకు తరలిస్తున్నారు. వందల కిలోమీటర్లు తరలిస్తున్న పశువులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. కిక్కిరిసిపోయేలా వాహనాల్లో పశువులను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం పలు వాహనాల్లో జాతీయ రహదారిపై నిత్యం శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ వైపు పశువుల తరలింపు వాహనాలు వెళుతున్నాయన్నారు. మినీ గూడ్స్ వాహనాలు, కంటైనర్లు వంటి వాహనాల్లో పదుల సంఖ్యలో పశువులను తరలిస్తున్నారు. గాలి కూడా ఆడకపోవడంతో మార్గం మధ్యలోనే కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయి. వాహనాల్లో పశువులను కుక్కడంతో వాటికి కనీసం అటూఇటూ కదిలే అవకాశం ఉండడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వాహనాల్లో నుంచి రోడ్డుపై పశువులు పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి. తరలించే వాహనాలకు రికార్డులు, నంబర్ ప్లేట్లు, బ్రేక్ లైట్స్, సిగ్నల్ లైట్స్ లేకపోవడంతో వెనక వస్తున్న వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పరదేశమ్మ జాతరకు ఏర్పాట్లు

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మతల్లి 38వ జాతర మహోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23న అమ్మవారి జాతర, 24న తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వేముల శివన్నారాయణ తెలిపారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయం నుంచి గ్రామ ముఖద్వారం వరకూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం రాత్రి విశాఖపట్నం వారితో డీజే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, విజయవాడ వారితో మ్యూజికల్ నైట్-డ్యాన్స్ హంగామా, వెంకటరమణ మూర్తి పాట, గరగలాట ఏర్పాటు చేశారు. గురువారం తీర్థం, విశేష పూల అలంకరణలో అమ్మవారి దర్శనాలు, గాజువాక వారితో డీజే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కూచిపూడి నృత్య ప్రదర్శన, బొమ్మల ప్రదర్శన, సన్నాయి మేళం తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

### సీపీఎం విస్తృతస్థాయి సమావేశం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్యభవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ రూరల్ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు సీహెచ్ విజయకుమార్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందన్నారు. అనంతరం సీపీఎం రూరల్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సభ్యులుగా తొట్టిపూడి రాజా, సీహెచ్ విజయకుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటేశ్వరరావును నియమించినట్లు రాజశేఖర్ వివరించారు.

### ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఎమ్మెల్సీ

కాకినాడ రూరల్: ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీ ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. రమణయ్యపేట వైద్యనగర్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, నారాయణరావు దంపతులను కన్నబాబు శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదలతో విజయం సొంతం



కృష్ణచైతన్యను సత్కరిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, అధ్యాపక బృందం, విద్యార్థులు

కాకినాడ సిటీ: కృషి, పట్టుదల ఉంటే విజయం సొంతం అవుతుందని శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో గ్రూప్-1 ర్యాంకర్ డాక్టర్ కృష్ణ చైతన్యకు జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కృష్ణచైతన్య గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం పొందడం గర్వకారణమన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ సివిల్స్ పరీక్షల నిమిత్తం 2019 నుంచి కోచింగ్ తీసుకుంటున్నానని, ఏపీపీఎస్సీ గ్రూప్-1 మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తన విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కోచింగ్ ఇస్తున్నారన్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ అనుపమ, ఎస్.వాసు, కృష్ణచైతన్య తల్లిదండ్రులు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజ తదితరులు కృష్ణచైతన్యను సత్కరించారు.

# గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తుని రూరల్: వంట గ్యాస్ వినియోగించే మహిళలు వంటింట్లో సురక్షితంగా ఉండాలని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ సూచించారు. మండలంలోని హంసవరంలో తుని సమత గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సర్వీసింగ్ శిబిరం, గ్యాస్ ప్రమాదాలపై అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. లబ్ధిదారులకు కొత్త గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరీఅవినాష్ మాట్లాడుతూ సమత గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన ఉచిత సర్వీసింగ్‌ను వంట గ్యాస్ వాడకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు వంటగ్యాస్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవిస్తే ఏవిధంగా స్పందించాలో సమత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1906కు ఫోన్ చేయాలన్నారు. రాయి దాసు, రాయి రమేష్, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.